కవితా కౌముది

# కాలేజీ

దారల విజయ కుమారి

అమాయకంగా నడిచే పూలను
సోలినా..అల్లరి చేసే
పరిమళాలను చూసానక్కడ

సద్దుల గూర్చి ఊసెరుగని సుద్దులను చూసా
దాపరిక లేని బుజాలపై
చేతులేసుకునే నడిచే స్నేహాలను చూసా

భావోద్వేగాల బాల్యదశ
ఎగసిపడే యవ్వనమవడం చూసా
బతుకు దెరువు పునాదులను
బద్రంగా వేసుకోవడం చూసా

నడుమ గోడలెరుగని యువ సమాజంలో
రాజకీయాల కత్తి చేసే
కాలేజీ విభజనలను చూసా

స్నేహపు పొత్తిళ్ళలో ఒత్తిగిలుతున్న యవ్వన
పసితనాలను చూసా

ఉరుములై మెరుపులై తృళ్ళింతలై
తపనలు నింపుకున్న
కాలేజీ కడలి తరంగాలను చూసా

విద్యా ధనరాసుల మూటల నెత్తుకుని
భవితవ్యం వైపెగిరిన పక్షులను చూసా

కులమతాల ఉమ్మడి బావిలో
సామరస్యాన్ని చేదుకోవడం చూసా

చీకు చింతల చితుకులతో
చలికాచుకోవడం చూసా

ముల్లుందని మరచి రేకులను రాల్చేసుకున్న
గులాబీలను చూసా

అగమ్యగోచరంగా సాగి అల్లరి పాలైన
యవ్వన అస్తిత్వాలను చూసా

ఒకనాడు ఎగసిపడిన ఆలోచనల
నొక్కవేయబడిన ఆవేశాల..ఆందోళనల
అవశేషాలు..శిలాజాలాలుగా మారిన
ఆ మనసు నేలలు నాకుచెందిన స్థిరాస్తులు

చేతుల పలుగులు చూపుల దీపాలను పట్టుకుని
నిదురరాని ఏ రాత్రిజాములోనో
ఒక్కడినే తవ్వుకుంటుంటా..

తవ్వకాల్లో బయటపడిన
ఆ నాటి అనుభూతులకు మరమ్మత్తులు చేసి
హృది మ్యూజియం లో బద్రపరుస్తుంటా

★★★




# నెచ్చెలీ..!

**కృష్ణరవళి**

పట్టు జలతారు పుట్టము రెపరెప లాడ
సడిసేయని నీ మెత్తని పాదాల మువ్వలు సడిసేయ
పూదారుల నడచిరమ్ము నా విరియబూసిన పూదోటకి
ఘడియయైనను చాలు..
నా నిరీక్షణ యెన్ని యుగముల నుండియో
తపించు నాతాపము తీర్చి సేద తీర్చుమా ..నాప్రేమ దేవతా ...!
అరవిరిసినవి అందముగా అరవిందములు ..కుసుమకుంజములు
పూ పరాగము పచ్చగా మేని నలదుకొని ..పరవశించి పరిమళ
గంధము వెదజల్లి
నీకై వేచిన పూబాలల నడుమ నడయాడుమా
చాలును క్షణమైన మెరయు తటిల్లత వోలె...
సంజకాంతులు దీప్తిమంతమై మురిసిపోవ ..!
సిగ్గులమొగ్గవే సిరిసిరి ప్రేమా నీవు
నునుసిగ్గుల కాంతులీను సింగారపు నెలవంకవే
సిగ్గుదొంతరల పగడము పూసిన వెన్నెల తీవా
స్నిగ్ధ హాసమున హసించిన మధుర ప్రేమ ధారా ..!
ఎరుకలేకనే ..మాకెరుకలేకనే ..మావికొమ్మల చాటునో
మల్లెపొదల జాడనో మాయమౌదువేని ..మాయమైననేమి...
నీవు బహుమతించిన ఆప్రేమ నగదు దోసిటనిండ
తాకినంతనే వసివాడు పరిమళాల పారిజాత మైననేమి
గాలి రెపరెపల వణుకు దీపశిఖయైన నేమి
నీ ఆగమనమే అంజలినిండిన అనురాగపు గని
అమృతమీ బ్రతుకున ప్రేమ భావము ..
మృతములేనిదీ ప్రేమ జీవనము ..!

మనసు చిగించిన ప్రేమవల్లరీ ..అల్లుకున్న మల్లెపందిరీ
అమ్మవడి వీడని పసిపాప నవ్వు లోని అందమే నీవు ..
నేలతల్లి దోసిట ఒదిగి ..దోగాడు చిన్నారి మొలకవేనీవు..
ఆర్ద్రత నిండిన నా అనుభూతి నీకెరుక పరుచుటెటుల ..?
హాయియైన యీ సంవేదన నీ వెరుగుటెటుల ..?
..ఏమని సందేశమిచ్చెద ..నీసంశయము తీరునటుల ..!
మనసు మధురానురాగాల ఊయలలూగునే నీ ..ఊహలతేలి
అలసి సొలసిన నాకనుల గాఢ సుషుప్తివి..సుందర సీమన
అలవోకగా తెలి రెక్కల వ్రాలిన సప్తవర్ణ రాగపురాతిరి రాణివి..!
కలల కౌగిలింతల కరుగునాకు నీకన్నుల వెలుగే వేకువ కానీ
ఏ పదములల్లి పల్లవింపచేసెద నీ పెదవుల రాగ మతిశయింప ..?
వెల్లువై కలక దీరిన వసంత వాహిని వీవు..శుభ్రజ్యోత్స్నవే నీవు
ప్రేమ సంగీత మాలాపించు ప్రశాంత లాహిరివే..సౌందర్య లహరి నీవే
పొంగిన కవితా ధారవే నీవు ..నా జీవన చైతన్య ప్రవంతివి ..
అలల కలల కవితల వెతల మతుల మమమతల మత్తుల మాధురి
నీవే ..!
మనసు పూచిన మరుల మాలికవే నీవు ..నా నెచ్చెలివే ..!

★★★



# మసాలా మాంత్రికుడు

పవన్ కుమార్ గజవల్లి

అతడొక మాంత్రికుడు
రైల్వేస్టేషన్, బస్సుస్టేషన్, సినిమా హాలు, పబ్లిక్ పార్కు మన వాడికి చిరునామాలు
నా ప్రతి సాయంత్రపు సంధ్య ప్రయాణంలో అతడొక మజిలీ
నా కళ్ళు అతని కోసం అప్రయత్నంగా వెదుకుతాయి
సూర్యుడికి వీడ్కోలంటూ చంద్రునికి స్వాగతం చెపుతూ
సహజంగా అతని మంత్రవిద్య ప్రారంభమవుతుంది
మూడు కర్రల వెదురు కుర్చీ అతని మంత్రాలకు వేదికవుతుంది
కొండెక్కినట్టుండే దీపపు కిరోసిన్ చిమ్నీ ఒలంపిక్ క్రీడల ప్రారంభపు కాగడా అవుతుంది
ముంతలోని మంటని చూసినపుడతడు నిత్యాగ్నిహోత్రుడనిపిస్తాడు
కాగితం అతని దగ్గర శంకువవుతుంది
మురమరాలతని దగ్గర ముత్యాలవుతాయి
చేయంత మురమరాలు, ఉడకేసిన శనగలు
వేయించిన పల్లీలు, కరకరలాడే బఠానీలు
కూసింత కరివేపాకు, వేలి చివరంత వెలిగారం
గుప్పెడంత ఉల్లిముక్కలు, గిలకరించిన నిమ్మరసం
అతని చేతి లాఘవం అబ్బురమనిపిస్తుంది
మెలి తిరిగిన చెయ్యేమిటో కళ్ళెదుటే కనిపిస్తుంది
చిత్రంగా విచిత్రంగా సూక్ష్మంలో మోక్షం అవగతమవుతుంది
ఆహుతుల నోళ్ళన్నీ నీళ్ళ చెలమలవుతాయి
అద్భుతం ఆవిష్కృతమవుతుంది, నల భీమం తయారవుతుంది
అరక్షణంలో అమృతం, అయిదు రూపాయల షడ్రసోపేతం
అతనిచ్చే తాటాకు ముక్కలు స్టీలు చెంచాలను వెక్కిరిస్తాయి
అతని మంత్రక్షేత్రంలో అడుగు పెట్టారా ?....
చాలిక, మీ నాసిక మీ నడకనతని వైపు శాసిస్తుంది
మీరు సైతం జఠరాగ్నికి అల్పాహారమొక్కటి ఆహుతిస్తారు
ఏమైనా అతనొక సూదంటు రాయి
నా ప్రతి సాయంత్రపు నేస్తం, మధ్య తరగతి చిరు దరహాసం

★★★

## ప్రేమ సాక్ష్యం
## సుజాత పి.వి.ఎల్

నీకు సంబంధించిన ఊహేగా
నన్ను కలవరంతో కలచివేసేది
మబ్బులపువ్వుల్ని
ఇంద్రధనుసుకి గుచ్చి
నీ మెళ్ళో వేయాలనుకోవడమేమిటి..
నువ్వు క్షణం కనిపించకపోతే..
పావురం మీదెక్కి
సతతహరితారణ్యాలను
గాలించాలనుకోడమేమిటి..
చిలకలతో సావాసం చేసి
నీపై రాసిన వలపు గీతాలను
పాడించి వినిపించాలన్న
తాపత్రయమేమిటి..
రాయంచ..నెమళ్ళ నాట్యాలతో
నిన్నలరించాలన్న తపనేమిటి..
మంచు ముత్యాలను ఏరుకొచ్చి
తామరాకులో పెట్టి
నీకు బహూకరించు
కోవాలనుకోవడమేమిటి..
నిశ్చల తటాక జల యవనికపై
అక్షర నక్షత్రాలతో కూర్చిన
కవనం కల్పితమవ్వొచ్చు..
నీపై నాకున్న అంతులేని అపేక్షకు
కన్న కలలకు నిదర్శనం..!
యదార్ధ జీవితాల సమ్మిళితమే
ప్రేమసాక్ష్యం!! ★★★

## కరుగుతున్న కాలం
## ఆర్.వి.రాఘవరావు

కాలం కరుగుతోంది అదృశ్యంగ
సెకన్లుగా ఘడియలుగా, గంటలుగా దినాలుగా.....
తరిగిపోతున్న మనిషి జన్మదినాలుగా

అనుభవాలు కదులుతున్నాయి దృశ్యంగ
వాదనగా వేదనగా బోధలుగా బాధలుగా........
అనుభూతులు ఆలపించే జీవనవేదాలుగా

దేహాలు వడివడిగా సాగుతున్నాయి
నెరుపుగా మరుపుగా మడతగా ముడతగా........
నడుస్తున్న నలుగురి భుజాలే చివరిఊతగా.

★★★

## గజల్
## వాసుదేవమూర్తి శ్రీపతి

చేతి కి మట్టి చుట్టం
కాలికి మట్టే బంధం
కంటిపాపల్లో ఉన్న లోకాన్ని వెలుగు మింగేసినట్టుంది!
కోటి బాధల్లో ఉన్న దేహాన్ని హాయి కమ్మేసినట్టుంది! -
నాలో నెత్తురు ఆవిరైపోయి తిత్తి మాత్రమే మిగిలిందా!
సత్తువ మొత్తం ఒక్కసారిగా నన్ను వదిలేసినట్టుంది! -
కంటి రెప్పలూ కాళ్లూ చేతులు కదలడం లేదు ఎందుకనో?
ఒంటిలోనున్న కండరాలన్ని సమ్మె చేసేసినట్టుంది! -
గుండె లోతుల్లొ చేరి కూర్చున్న గాలి రాయల్లె మారింది!
శ్వాసతో ఇంక అవసరం లేని కాలమొచ్చేసినట్టుంది -
బాధా లేదు, భయము లేదు శ్రీపతిలో ఏ యాతనా లేదు
దిగంతాలలో అంధకారాన్ని ఆత్మ దాటేసినట్టుంది

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

కలయొ మెలకువయో యెరుగని క్షణాన
కలత నిదురలోనేవేవొ తలపులెగయు
ఏమి యోచనలివ్వి నా యెడదనింత
గా ముసురుచున్నవిదియేమి కలవరమ్ము

జీవితము వ్యర్థమన్నంత చింత కలుగు
తలతు ప్రతిదినమ్మును నిరర్థకమటంచు
ఈ విధమ్ముగ బ్రతుకగనేల యంచు
ఎన్నడీ మనోరుగ్మత నన్ను వీడు

తాపమే లేక యీ పరితాపమేల
ప్రమదమందెడువేళనీ వగపదేల
ముదము కానక విలపించు మది యిదేమి
ఏల మనసుకు దారి తప్పించు బుద్ధి

కారణములున్నపుడు లేని క్షణములందు
కలుగజేయును చిత్తమ్ము కలవరమ్ము
హేతువన్నది లేకపోయినను గాని
ఏల యానందమును మనకీయలేదు

ఎన్ని విధముల మనసు బాధించుచుండు
నన్ని విధములనానందమందజేయ
ఖేదమైనను మించు సమ్మోదమైన
సమముగా చూచు సద్వృత్తి సాధ్యమౌను

COMMENTS